రెండవ రోజు : 30 ఆగష్టు, 2018

## కరువును శాశ్వతం చేస్తున్న పాలకులు

ప్రత్యామ్నాయ విధానాలతోనే సీమ సస్యశ్యామలం

రెండో రోజు బస్సు యాత్రలో సిపిఐ, సిపిఎం నేతలు

స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా రాయలసీమలో కరువును రూపుమాపలేకపోయిన పాలకుల తీరును సిపిఐ, సిపిఎం నేతలు ఎండగట్టారు. ప్రత్యామ్నాయ విధానాలతోనే రాయలసీమను రతనాల సీమగా మార్చడం సాధ్యమన్నారు. బస్సు యాత్ర రెండో రోజు (గురువారం) ఉదయం 10 గంటలకు అనంతపురం జిల్లా మడకశిర నుండి బయలుదేరి కళ్యాణదుర్గం చేరింది. కళ్యాణదుర్గంలో బహిరంగసభ ముగించుకుని ఉరవకొండకు వెళ్తున్న దారిలో వర్షాలు లేక ఎండిపోయిన శనగ పంటను బస్సు యాత్రా బృందం పరిశీలించింది. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామ రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏడు ఎకరాల్లో వేసిన శనగ పంట ఎండిపోయిందని, సుమారు 80వేల పైనే ఖర్చయ్యిందని రైతు హనుమంతు చెప్పారు. జిల్లా అంతటా పంటలు ఇలాగే ఎండిపోతున్నాయని రైతులు వాపోయారు.

బస్సు యాత్రకు కళ్యాణదుర్గంలో వామపక్ష కార్యకర్తలు, మేధావులు, అభిమానులు, మహిళలు సాదరంగా యాత్రకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోపాల్ అధ్యక్షతన సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల వరదలొస్తే ప్రకాశం బ్యారేజి ద్వారా 1800 టిఎంసిల నీటిని సముద్రంలోకి వదిలేశారన్నారు. ఈ నీటిని కరువు ప్రాంతాలకు మళ్లించివుంటే రాష్ట్ర వ్యాప్తంగా పంటలకు నీటిని అందించే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి విధానాన్ని తీసుకొచ్చే ఉద్దేశ్యం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేదన్నారు. స్వాతంత్య్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు కరువును పోగొట్టలేని దౌర్భాగ్య స్థితిలో పాలకులు ఉన్నారన్నారు. ఏ మొహం పెట్టుకుని చంద్రబాబు, జగన్‌లు ఓటు కోసం ప్రజల ముందుకు వస్తారని ప్రశ్నించారు. హంద్రీనీవా ద్వారా రాయలసీమకు ఆరు లక్షల ఎకరాలకు నీటిని అందిస్తామని చెప్పిన బాబు నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్క ఎకరాకు నీరిచ్చిన దాఖలా ఉందా అని ప్రశ్నించారు. జగన్‌కు ముఖ్యమంత్రి సీటు తప్ప ఇంకా ఏమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కరువులోనే పుట్టి, కరువులోనే పెరిగి, కరువులోనే చచ్చిపోయే పరిస్థితిని నేటి పాలకులు శాశ్వతం చేస్తున్నారు తప్ప, యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టులను పూర్తిచేసి నీటిని అందించాలన్న చిత్తశుద్ధి వారికి లేదన్నారు. ఒకప్పుడు రతనాల సీమగా చెప్పబడిన ఈ ప్రాంతాన్ని రాళ్లసీమగా మార్చేశారన్నారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వ్యవస్థ రావాలని ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకొస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన, ఇంకా ఇతర శక్తులను ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రచయితలు, కవులు, మేధావులు, పౌరహక్కుల నాయకులు, కమ్యూనిస్టులు, జర్నలిస్టులను హత్య చేసేందుకు వెనుకాడటం లేదన్నారు. తాజాగా పూణే పోలీసులు పౌరహక్కుల సంఘం నాయకులను అరెస్టు చేయడంతో, సుప్రీంకోర్టు వాతలు పెట్టి ఇంటికి పంపించాలని సూచించిందన్నారు. కళ్యాణదుర్గంలో జనసేన కన్వీనర్లు నరసయ్య, రాజేష్, ప్రతాప్‌లు బస్సుయాత్రకు సంఘీభావం తెలిపారు. అక్కడ నెలకొన్న భూ సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. ఈ బస్సుయాత్రలో సిపిఐ రాష్ట్ర నాయకులు రావుల వెంకయ్య, డి.జగదీష్,యన్.లెనిన్‌బాబు,చంద్రానాయక్, వి.జయలక్ష్మి, సిపిఎం నాయకులు పెద్దిరెడ్డి, రాంభూపాల్, ఎం.క్రిష్ణమూర్తి పాల్గొన్నారు. సాయంత్రం ఉరవకొండలో సభ జరిగింది.

= = = =